# సినిమా బండి

"నా పేరు రాజు" అన్నాడతను.

అతని ఎదురుగా రివాల్వింగ్ చెయిర్‌లో ఫిలిం ప్రొడ్యూసర్ నిరంజనం కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు.

"చెప్పండి. ఏం పనిమీద వచ్చారు?" అన్నాడు నిరంజనం.

"మీతో మాట్లాడాలని వచ్చాను"

"ఏవిషయం గురించి? సినిమాల గురించా?" అన్నాడు నిరంజనం పొగపీల్చి.

"అవును"

"సారీ! నేను నా సినిమాలో కొత్త వాళ్ళకు ఛాన్సు ఇవ్వదల్చుకోలేదు" అన్నాడు నిరంజనం.

నిరంజనం ప్రొడ్యూసరే కాదు. దర్శకుడు కూడా. అతని సినిమాలకు కథకూడా అతనే రాస్తాడు.

రాజునవ్వి, "మీరు పొరబడ్డారు. నేను మీదగ్గరకు సినిమా ఛాన్సు గురించి అడగటానికి రాలేదు" అన్నాడు.

"ఎందుకోసం వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు నిరంజనం.

"చెబుతాను. నాకు సినిమా ఫీల్డు గురించి తెలియకపోవచ్చును. కాని ప్రేక్షకుల టేస్టు గురించి బాగా తెలుసు. అంతేకాదు. ఇప్పుడు వస్తున్న సినిమాల గురించి నేను స్టడీ చేశాను. ఓ సినిమా ఎందువల్ల విజయవంతమవుతుంది? ఇంకో సినిమా ఎందుకు ఫెయిలవుతుంది? అనే విషయం గురించి నేను సరయిన కారణాలు చెప్పగలను. నేనో

విమర్శకుడిని. ఈ మధ్యనే రిలీజయిన మీ 'నవ్వా? ఏడుపా?" సినిమా చూశాను. అది ఘోరంగా ఫ్లాప్ కావటం విచారకరం. మీ సినిమా ఎందువల్ల అంత దారుణమయిన దెబ్బతిన్నదో నేను చెప్పగలను" అన్నాడు రాజు.

అతడి మాటలు నిరంజనంలో కొంచెం ఉత్సాహాన్ని కలిగించాయి. నిజమే ఈ మధ్యనే రిలీజయినే తన చిత్రం 'నవ్వా? ఏడుపా?' సినిమా పూర్తిగా ఫెయిలయింది. ప్రేక్షకులు ఆ సినిమాను తరిమి కొట్టారు. ఆ సినిమా తీసి తను బాగానే నష్టపోయాడు.

"చెప్పండి! నా చిత్రం 'నవ్వా? ఏడుపా?' ఎందువల్ల ఫెయిలయిందంటారు." అడిగాడు నిరంజనం కొత్త సిగరెట్టు ముట్టించి.

"నవ్వా? ఏడుపా?' కథ చాలా వీక్‌గా వుంది. కథలో కథకంటే సంఘటనలు ఎక్కువగా వున్నాయి. కథ ముందుకు వెళ్ళకుండా ఈ సంఘటనలు బాగా అడ్డుపడ్డాయి గంట గడచినా కథ అక్కడేవుండటంలో ప్రేక్షకులకు విసుగు పుట్టింది".

"ఆగండి! సంఘటనలు కథకు ఏ విధంగా అడ్డం తగిలాయి? వివరంగా చెప్పండి" అన్నాడు నిరంజనం మధ్యలో.

"అదే చెబుతున్నాను. సినిమా మొదలయిన పావుగంట తర్వాత హీరో బామ్మ చనిపోతుంది. ఆమెకు అరవైయ్యేళ్ళ వయినే వుంటాయి. ఆమె సహజ మరణానికి హీరో ఆమె శవంమీద పడి, 'బామ్మా! నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయావా? ఇక రేపటినించి నేను 'బామ్మ' అని ఎవర్ని పిలవను?....అంటూ అరగంటసేపు శవాన్ని కదిలించివేస్తూ ఏడుస్తాడు నిజానికి హీరో తల్లి, తండ్రి బతికేవుంటారు. చిన్నతనంలో రోజూ పదిపైసలు ఇచ్చినంత మాత్రాన హీరో అరగంటసేపు ఆమె మీద పడి ఏడ్చి ఏడ్చి ఓ బిందెడు కన్నీళ్ళు కార్చవలసిన అవసరం

లేదు. ఆతర్వాత నాచురల్‌గా వుండాలని శవాన్ని నీళ్ళతో కడగటం, వీధులలో డప్పులతో వూరేగించటం, శవాన్ని తగలేసే సీను, మళ్ళీ ఒక్కసారి అందరూ ఏడవటం, అవన్నీ కథాగమనానికి సంబంధం లేనివి. ఇటువంటివే ఇంకొన్ని సంఘటనలు వున్నాయి. ఈ సంఘటనల వల్ల కథ దెబ్బతిన్నది".

రాజు మాటలు వింటూ నిరంజనం ఆలోచించాడు. అతను చెప్పిన కారణాలు సరయినవేనని అనిపించింది.

"ఇంకా?" అన్నాడు కుతూహలంగా.

మధ్యలో బోయ్‌ని పిలిచి రెండు కూల్‌డ్రింకులు తీసుకురమ్మని చెప్పాడు.

నిరంజనంలో కుతూహలం గమనించి మళ్ళీ చెప్పటం మొదలు పెట్టాడు రాజు.

"సంభాషణలు కూడా పేలవంగా వున్నాయి. ఎలాగంటే– కొన్ని కారణాలవల్ల హీరో-హీరోయిన్ ఇంట్లో వుంటాడు. అప్పటికి ఇద్దరికీ పెళ్ళికాదు. హీరోయిన్ పప్పు వండుతూ వుంటుంది. హీరో చుట్ట కాల్చుకుంటూ, 'ఉప్పు వేశావా పప్పులో' అని అడుగుతాడు. హీరోయిన్ నవ్వుతూ, 'ఉప్పేకాదు కారం కూడా వేశాను' అంటుంది. ఆ తర్వాత హీరో, 'పెళ్ళి చేసుకోకుండానే మనిద్దరం ఒకే కప్పుకింద కలిసివుంటే ఈ చీదలోకం ఏమనుకుంటుంది? ఇన్నాళ్ళూ ఈవిషయమే మరిచిపోయాను. ఇవాళ సాయంత్రమే నిన్ను ఆ దేవుడు పటముందు పెళ్ళి చేసుకుంటాను. అప్పుడు సంసారమనే పప్పుకి మనిద్దరం ఉప్పు కారంలాంటి వాళ్ళం అవుతాము. చింతపండు - వుల్లిపాయలులాంటి పిల్లలు కూడా పుడితే మన సంసారం ఎంతో రుచిగా వుంటుంది' అంటాడు. నిజం చెబుతున్నాను. కొంతమంది ఈ డైలాగ్స్ విని

సంభాషణల రచయిత కొన్నాళ్ళు వంటవాడిగా పని చేశాడేమో అను కున్నారు".

"గుడ్.... మీ రీజనింగ్ బావుంది" నిరంజనం మెచ్చుకోలుగా అన్నాడు.

"థాంక్యూ సర్! మీ సినిమాను విమర్శిస్తున్నానని అనుకోకండి. చెప్పానుకదా నేను విమర్శకుడ్ని. ఇప్పుడు నేను చెప్పిన కారణాలే కాకుండా మీ సినిమాకు నటీనటుల ఎంపిక కూడా సరిగాలేదు. దర్శకత్వంలో కొన్ని లోపాలున్నాయి. ఫార్ములా పాటలుకూడా సినిమాను దెబ్బతీశాయి. ముఖ్యంగా హీరో చెల్లెలు తన అన్నయ్య తనకు ఇష్టమని మిరపకాయ బజ్జీలు నాలుగు తీసుకు వచ్చాడని తెగ సంతోషపడిపోతూ బజ్జీలు తింటూ "అన్నయ్యా బజ్జీలయ్యా- మరినువ్వే కదయ్యా - ఇక నేనేకదయ్యా" అంటూ హీరోచుట్టూ తిరుగుతూ పాట పాడటం, హీరోకి కలవచ్చి అందులో అతను చైనా కోయవాళ్ళమధ్య హీరోయిన్‌తో కలిసి పాట పాడటం ఇవన్నీకూడా ప్రేక్షకుల ఓర్పును టెస్టు చేశాయి. ప్రేక్షకులే ఓడిపోయి బయటకు వెళ్ళిపోయారు" అని రాజు ఇంకా 'నవ్వా? ఏడుపా?' సినిమాలోని లోపాలు సహేతుకంగా చెప్పాడు-

* * *

నిరంజనం కూడా అంతా విని "మీరు చెప్పిన పాయింట్లన్నీ రీజన్‌బుల్‌గా వున్నాయని ఒప్పుకుంటున్నాను. ఐతే సినిమాతీసే టప్పుడు ఇవన్నీ లోపాలని నాకు అనిపించలేదు" అన్నాడు.

నవ్వాడు రాజు. ఇంతలోనే బోయ్ డ్రింకులు తీసుకువచ్చాడు. ఇద్దరూ తీసుకున్నారు.

డ్రింకు తాగటం ఆపి "నేను మళ్ళీ ఓ సినిమాను కొంచెం తక్కువ బడ్జెట్‌లో తియ్యాలని ప్లాన్ చేస్తున్నాను. మీకభ్యంతరం లేకపోతే మీరు నా సినిమాకు ఎడ్వయిజర్‌గా వర్కు చెయ్యండి" అన్నాడు నిరంజనం.

"థాంక్యూ ఇందుకు నాకభ్యంతరంలేదు గాని...."

"అర్థమయింది. ఊరికే అవసరంలేదు. నేను అందుకు తగిన ప్రతిఫలం ఇస్తాను" అన్నాడు నిరంజనం.

రాజు నవ్వి "ప్రతిఫలం గురించికాదు. నా దగ్గర ఓ మంచికథ వుంది. దాన్ని మీకు చెబుతాను. నటీనటుల ఎన్నిక కూడా నేనే చేస్తాను. నా సలహాలతో మీరు సినిమా తియ్యండి. కనీసం పదిహేను కేంద్రాలలో ఐదా వంద రోజులు ఆడుతుంది. అలా ఆడితే నాకు లాభాల్లో పర్సెంట్, లేకపోతే ఏమీ ఇవ్వద్దు" అన్నాడు రాజు.

నిరంజనం ఒప్పుకున్నాడు.

రాజు తన దగ్గరున్న కథ చెప్పాడు. ఆ కథ నిరంజనానికి నచ్చింది. ఆ రోజునే ఇద్దరికీ ఒప్పందం జరిగింది. సినిమా పనులు మొదలైనాయి.

* * * * *

నిరంజనం- రాజు కథతో, సలహాలతో తీసిన 'వెనకింటి కథ' సినిమా రిలీజయ్యింది. వారం రోజులు గడిచేసరికే ఆ సినిమాకు మంచి సినిమా అనే పేరు వచ్చింది. కలెక్షన్స్ రిలీజయిన అన్ని కేంద్రాలలో బాగున్నాయి.

రాజును మెచ్చుకోకుండా వుండలేకపోయాడు నిరంజనం.

'నవ్వా? ఏడుపా?' సినిమాతో చావుదెబ్బతిన్న నిరంజనం

ఇటువంటి బాక్సాఫీస్ హిట్‌ను ఎలాచేసాడో అర్థంగాని ఫెయిల్యూర్ చిత్రాల నిర్మాతలు నిరంజనం చుట్టూ చేరిపోయి ప్రశ్నల వర్షం కురిపించారు.

రాజు పేరు బయటకు వచ్చింది.

అప్పటికప్పుడే కొంతమంది తాము తియ్యబోయే సినిమాలకు రాజును ఎడ్వయిజర్‌గా నియమించారు. ఓ నిర్మాత రాజుచేత ఓ సినిమా కథ రాయించుకున్నాడు.

"వెనకింటి కథ" పదిహేడు కేంద్రాలలో వంద రోజులు ఆడింది. ఆ సినిమా శతదినోత్సవ సభలో తన చిత్రం విజయవంతం కావటానికి రాజే కారణమని అందరికీ చెప్పేశాడు నిరంజనం. దాంతో రాజు పేరు ఫిలిం ఇండస్ట్రీలో బాగా పాపులర్ ఐపోయింది.

ఆ తర్వాత రాజు కథ రాసిన చిత్రాలు, అతను ఎడ్వయిజర్‌గా వర్కు చేసిన సినిమాలు బాగా విజయవంతం కాసాగాయి.

కొన్ని నెలల్లోనే రాజు తనుకూడా సినిమా తియ్యగలిగినంత డబ్బు సంపాదించాడు. అప్పుడు అతనికి తన తెలివితేటలన్నీ ఉప యోగించి తనే దర్శకత్వం కూడా వహించి ఓ సినిమా తీయాలనే ఆలోచన వచ్చింది.

ఓ రాత్రి కూర్చుని సినిమా కథ రాశాడు. తర్వాత నటీనటుల ఎన్నిక కూడా చేసుకున్నాడు.

సినిమా మొదలుపెట్టాడు.

రాజు సినిమా రెండు నెలలకే పూర్తయింది. దాని పేరు "రేపు కలుసుకో".

రిలీజయ్యింది. అందరూ ఆ సినిమా తప్పకుండా సక్సెస్ అవు తుందని అనుకున్నారు. కాని పదిరోజులుకూడా కాకముందే అన్ని

థియేటర్లలో "రేపు కలుసుకో" సినిమాను తీసేశారు. రాజుకు షాక్ కొట్టి నట్లు అన్పించింది.

తనకు ఇంతటి ఘోర పరాజయం జరుగుతుందని రాజు కల్లో కూడా వూహించలేదు.

రాజు ఈ షాక్‌లో వుండగానే అతన్ని కలుసుకొనేందుకు ఓ యువకుడు వచ్చాడు. "మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు.

"నాకు సినిమా ఫీల్డ్ గురించి తెలియకపోవచ్చును. కాని ప్రేక్షకుల టేస్ట్ గురించి బాగా తెలుసు. ఈ మధ్యనే రిలీజయిన మీ 'రేపు కలుసుకో' సినిమా చూశాను. మీ సినిమా ఎందువల్ల అంత దారుణ దెబ్బతిన్నదో నేను చెప్పగలను" అన్నాడు.

సరిగ్గా ఇవే మాటలు ఒకప్పుడుతను, ఒక ప్రొడ్యూసర్‌తో అని సినిమారంగంలో అడుగుపెట్టాడు.

"చెప్పండి! నా చిత్రం "రేపు కలుసుకో" ఎందువల్ల ఫెయిలయిం దంటారు?" అడిగాడు రాజు– ఉత్సుకతను చంపుకోలేక, అతడు చెప్పే విషయమేమిటో తెలిసి కూడా.

అతను వివరంగా చెప్పాడు. అద్భుతంగా చెప్పాడు.

"నీవు ఫీల్డ్‌కి పనికొస్తావ్" అన్నాడు రాజు. అతడానందపడ్డాడు. సినిమా బండి ఎక్కాడు.

*

(1982 మే – విజయ మాస పత్రిక)